తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్షికోత్సవం 1996 - 2026

## స్విమ్స్‌లో...
# ఒబెసిటీ టు మొబిలిటీ పై అవగాహన




తిరుపతి హెల్త్, జూలై 18 ప్రభాతవార్త : శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఎండోక్రైనాలజీ విభాగం ఆధ్వర్యంలో ఒబెసిటీ టు మొబిలిటీ అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ ఎండోక్రైన్ సొసైటీ వార్షిక మహాసభల్లో భాగంగా ప్రత్యేక నిరంతర వైద్య విద్యా కార్యక్రమం జూలై 18 తేదీ మధ్యాహ్నం 2 గంటలకు స్విమ్స్ శ్రీ పద్మావతి ఆడిటోరియం ఓ.పి.డి బ్లాక్ నందు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమం స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగింది. ప్రముఖ ఎండోక్రైనాలజిస్టు సి.ఎం.సి వేలూరు నుంచి ప్రొఫెసర్, హెడ్ యూనిట్ 1 డా. నితిన్ కపూర్ ఊబకాయంలో కండరాలు ఎముకల ఆరోగ్యం అనే అంశంపై వివరిస్తూ ఊబకాయం వల్ల కండరాలు, కీళ్లు, ఎముకలపై అధిక ఒత్తిడి ఏర్పడి మోకాళ్ల నొప్పులు, వెన్నునొప్పి, కీళ్ల సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని వివరించారు. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, బరువు నియంత్రణ ద్వారా కండరాలు ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచి ంచారు. ఊబకాయం ఉన్నవారిలో బరువును నియంత్రించడం, సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, తగినంత ప్రోటీన్ వినియోగించడం, క్రమం తప్పకుండా నడక, కండరాల బలాన్ని పెంచే వ్యాయామాలు చేయడం ద్వారా కండరాలు మరియు ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని ఆయన సూచించారు. ఎండోక్రైనాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా. గాయత్రి మాట్లాడుతూ ముగింపులో వక్తలు, నిర్వాహకులు, అధ్యాపకులు, వైద్యులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ అలోక్ సచన్, సీనియర్ గ్రేడ్ ప్రొఫెసర్ మరియు మెడిసిన్ విభాగాధిపతి డా. అల్లాడి మోహన్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా .ఉమామహేశ్వర రావు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. అంజు డి ఆదే పాల్గొన్నారు.

## ఈ ఏడాదిలో మరో...
# ఏడు రాకెట్ ప్రయోగాలు

### -విక్రమ్ వన్ రాకెట్ ప్రయోగం విజయవంతం
### -ఇస్రో ఛైర్మన్ వి నారాయణన్

సూళ్లూరుపేట, జూలై 18 ప్రభాతవార్త : శ్రీహరికోట వేదికగా శనివారం నిర్వహించిన విక్రమ్ రాకెట్ ప్రయోగం ఆద్యంతం ఉత్కంఠ భరితంగా కొనసాగింది. విజిటర్స్ గ్యాలరీలో ఒకపక్క సందర్శకులు మరోపక్క వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు కోలాహలంగా ప్రయోగాన్ని వీక్షించేందుకు ఉదయం నుంచే శ్రీహరికోటకు చేరుకున్నారు. కౌంట్ డౌన్ సమయం పూర్తిచేసుకుని రాకెట్ నిర్దేశించిన సమయానికి నింగిలోకి ఎగురు తుందని ఆశగా చూస్తున్న ప్రతి ఒక్కరికి ఒక్కసారిగా కౌంట్ డౌన్‌ను నిలిపివేశారని తెలియడంతో ఒక్కసారిగా అక్కడి ఆహ్లాదకర వాతావరణం ఉత్కంఠ భరితంగా మారింది. అసలు ప్రయోగం జరుగుతుందాలేదా అన్న సంశయం ప్రతి ఒక్కరిలో మొదలైంది. తిరిగి 15 నిమిషాల అనంతరం కౌంట్ డౌన్ ను కొనసాగిస్తున్నారన్న సమాచారంతో ఒక్కసారిగా అందరూ కరత ళధ్వనులు చేస్తూ ప్రయోగం కోసం ఎదురు చూపులు చూశారు. సరిగ్గా 12 గంటల ఐదు నిమిషాలకు విక్రమ్ వన్ రాకెట్ నిప్పులు తిరుగుతూ నింగికి దూసుకు వెళ్లడం చూసి కేరింతలు కొట్టారు. ఇస్రో ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఏడు ప్రయోగాలను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణ వెల్లడించారు. శనివారం విక్రమ్ వన్ ప్రయోగ విజయనంతరం శ్రీహరికోటలోని మీడియా సెంటర్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందుకు సంబంధించి రెండు రాకెట్లు సిద్ధంగా ఉన్నాయని, మరో ఐదు రాకెట్లు వివిధ దశల్లో నిర్మాణ ప్రక్రియలో ఉన్నాయని తెలిపారు. స్కై రూట్ సంస్థ ప్రథమ ప్రయత్నంలోనే అద్భుత విజయాన్ని సాధించడం చారిత్రాత్మక మని చెప్పారు. స్కై రూట్ సంస్థ సీఈవో పవన్ కుమార్ చందన మాట్లాడుతూ విక్రమ్ వన్ రాకెట్ నిర్దేశించిన కక్షలోకి విజయవంతంగా చేరిందని అద్భుతంగా పనిచేస్తుందని చెప్పారు. గ్లోబల్ స్పేస్ సెక్టార్లో ఈ విజయం మంచిదిగా ఆయన చెప్పారు. ఈ విజయంతో ప్రైవేట్ అంతరిక్ష రంగంలో భారత్ మూడో స్థానంలోకి చేరుకుందని తెలిపారు. ఇది భారతదేశానికే గర్వకారణమని తెలిపారు. ప్రైవేట్ సంస్థ నుంచి లాంచ్ ప్యాడ్ వరకు తీసుకొచ్చి ప్రయోగం నిర్వహించడంలో సమిష్టి కృషి ఉందన్నారు. ఇస్రో, స్కై రూట్ శాస్త్రవేత్తల సమిష్టి కృషి ఇందులో ఉందని ఆయన చెప్పారు. యువ శాస్త్రవేత్తల బృందం ఈ విజయంలో పాలుపంచుకుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో షార్ డైరెక్టర్ ముత్తు చళియన్, స్కై రూట్ సంస్థ సీఈవో నాగ భరత్ దాకా, డైరెక్టర్ ఇన్ స్పేస్ పవన్ కుమార్ గోయంక, డైరెక్టర్ ఇన్ స్పేస్ రాజీవ్ జ్యోతి, ఎంఎస్‌డి గ్రూప్ డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




నింగిలోకి దూసుకెళ్ళుతున్న విక్రమ్-1 రాకెట్

**- ప్రత్యేక ఆకర్షణగా నారా లోకేష్ :**
ఈ ప్రయోగానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రథమంగా శ్రీహరికోటకు రావడంతో ఆయన ప్రత్యేక ఆకర్షణగా మారారు. తన కుమారుడు నారా దేవాన్ష్‌ను వెంట బెట్టుకొని మిషన్ కంట్రోల్ సెంటర్లో శాస్త్రవేత్తలతో కలిసి ప్రయోగాన్ని వీక్షించారు. ప్రయోగ వివరాలను కుమారునికి వివరిస్తూ, శాస్త్రవేత్తల నుంచి వివరాలు తెలుసు కుంటూ ప్రయోగం విజయం అయిన వెంటనే చప్పట్లు చరుస్తూ హరాన్ని వెలిబుచ్చారు. అలాగే స్కై రూట్ సంస్థకు చెందిన యువ శాస్త్రవేత్తలు ఉత్కంఠ వీడి ప్రయోగం విజయం తర్వాత ఒకరినొకరు అలిగినను చేసుకుంటూ జాతీయ జెండాను ఎగురవేస్తూ సంబరాలు చేసుకున్నారు. ప్రయోగాన్ని ఇస్రో మాజీ ఛైర్మన్లు సోమనాథ్, రాధాకృష్ణన్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, శ్రీ సిటీ ఎండి రవి సన్నారెడ్డి, పలువురు శాస్త్రవేత్తలు, ప్రముఖులు తిలకించారు.



శ్రీహరికోటలో కుమారునితో మంత్రి లోకేష్

**ఇస్రో, స్కై రూట్ శాస్త్రవేత్తకు...ప్రధాని అభినందలు:**
విక్రమ్ వన్ ప్రయోగ విజయం తర్వాత శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ సెంటర్లో భారత ప్రధాని నరేంద్ర మోడీ సెల్ ఫోన్‌లో ప్రథమ స్వదేశీ ప్రైవేట్ భాగస్వామ్యంతో రూపొందించిన విక్రమ్ రాకెట్ ప్రయోగం విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్కై రూట్ సీఈవో డాక్టర్ పవన్ కుమార్ చందనను ఆయన అభినందించారు. ప్రభుత్వం స్పేస్ టెక్నాలజీ రంగంలో ప్రైవేట్ రంగానికి ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వి నియోగం చేసుకున్నందుకు సంస్థను ఆయన ప్రశంసించారు. అలాగే ఇస్రో స్కై రూట్ సంస్థల సమిష్టి కృషితో ఈ విజయం సాధించడం భారతదేశ అంతరిక్ష రంగంలో శుభపరిణామంగా ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా సీఈవో పవన్ కుమార్ చందన ప్రధానితో మాట్లాడుతూ మీరు పంపిన వందేమాతరం పోస్ట్ కార్డును విజయవంతంగా అంతరిక్షంలోకి విక్రమ్ వన్ రాకెట్ ప్రవేశపెట్టిందంటూ చెప్పారు. ప్రయోగానికి ముఖ్యఅతిథిగా హాజరైనకేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ భారతదేశంలో ఇటువంటి ఘనతను సాధించడం మంచి పరిణామం అన్నారు. 8 సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన స్కై రూట్ సంస్థ మొదటి ప్రయోగంలోని విజయం సాధించడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ స్కై రూట్ సంస్థ సాధించిన విజయం తెలుగు ప్రజలకు గర్వకారమన్నారు. ఇటువంటి సంస్థలను ప్రోత్సహించేందుకు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇందుకు అనుగుణంగా వైజాగ్ వేదికగా ఇటువంటి సంస్థలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తే తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఇస్రో ఛైర్మన్ వి నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి ప్రోత్సాహం కల్పించే విధంగా విధానాలు రూపొందించడంతో ప్రస్తుతం దేశంలో 400 స్టార్టప్ కంపెనీలు ఉన్నాయన్నారు. కానీ అందులో స్కై రూట్ సంస్థ మొదటి ప్రయోగంలోనే విజయం సాధించి తన ప్రత్యేకతను చాటుకుందని చెప్పారు.



ఇస్రో స్కై రూట్ సంస్థల ప్రతినిధులను సన్మానిస్తున్న ఇస్రో ఛైర్మన్ తదితరులు

## నేడు యుపిఎస్‌సిలో ఏసిఎస్ పరీక్ష : డిఆర్ఓ




సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ

తిరుపతి కలెక్టరేట్, జూలై 18 ప్రభాతవార్త :యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో ఆదివారం సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ (ఏసిఎస్) పరీక్ష, 2026 నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయడమైనదని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు తెలియజేసారు. జిల్లాలో మొత్తం 2 పరీక్ష కేంద్రాలలో 773 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన లైసన్ అధికారులు మరియు సంబందిత ఆదికారులతో శనివారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ ఈ నెల 19 వ తేదీన నిర్వహించనున్న పరీక్షలు ఉ. 10 గంటల నుండి మ 12 గంటల వరకు మరియు మధ్యాహ్న 2 గంటల నుండి సాయంత్రం 5. వరకు 2 పరీక్ష కేంద్రాల నందు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయని పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్‌వాచ్ లు, వైర్లెస్ హెడ్ సెట్స్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదని, పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు, ఆర్టీసి బస్సు సౌకర్యం, విద్యుత్ అంతరాయం లేకుండా సంబందిత శాఖల అధికారులు చూడాలని, త్రాగు నీరు, టాయిలెట్స్ సక్రమంగా ఉండాలని, అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టిసి వారు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జినరసింహులు, యూపీఎస్సీ అబ్జర్వర్ డిప్యూటీ సెక్రటరీ సంబందిత అధికారులు పాల్గొన్నారు.

# గంగ గల గలా... పంటలు కళ కళ!

### -కరువు,కష్టకాలంలో అన్నదాతలను ఆదుకుంటున్న తెలుగుగంగ



నిండుగా పారుతున్న తెలుగుగంగ

తొట్టంబేడు, జూలై 18 ప్రభాతవార్త: వరుణ దేవుడు ముఖం చాటేసిన తరుణంలో, తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల ఆన్నదాతలను తెలుగుగంగ ఆదుకుంటుంది. కరువు, కష్టకాలంలో తెలుగుగంగ పరివాహక ప్రాంతం కన్నువ ఇంపుగా ఆహ్లాదంగా పంటపొలాల్లో పచ్చని పంట కళ కళ లాడుతూ దర్శనమిస్తుంది. సుమారు 50కిలో మీటర్లమేరకు ఉన్న సుమారు 50 గ్రామాల్లో తెలుగుగంగ నీరు అన్నదాతల పంట పొలాలను ఆదుకుంటుంది. రైతుల్ని అప్పులు కాకుండా కాపాడుతుంది. తెలుగుగంగ కాలువ నుంచి 2004-2009లో శాసనసభ్యుడుగా ఉన్న ఎస్‌సివినాయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుతో పోరాడి రెండు మండలాల్లో చెరువులకు గంగ కాలువకు తూములు ఏర్పాటు చేయించారు. ఈ ప్రయత్నం నేడు అన్నదాతల పాలిట వరంగా మారింది. ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉ న్నా గంగ పరివాహక ప్రాంతాలు మాత్రం పచ్చని పంటపొలాలతో దర్శనమిస్తుంది. తొట్టంబేడు మండలం చియ్యవరం నుంచి బుచ్చినాయుడు కండ్రిగ సరిహద్దులైన మదనం బేడు వరకు గల సుమారు 50పైగా గ్రామాలు నేడు రెండవ పంటతో కళ కళలాడుతున్నాయి.
చెన్నైకు మంచినీరు రాయలసీమకు సాగునీరందించుటకు నాడు ఎన్‌టి రామారావు రూపకల్పన చేసిన మహోన్నత పథకం తెలుగుగంగ. 1999లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టుబట్టి ప్రారంభించారు. ఆ అపరభగీరథుని కృషితో తెలుగుగంగను రైతులకు అందించగా శ్రీకాళహస్తికి చెందిన మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజక వర్గాల్లోని అన్నదాలతకు పంట కాలువలను ఏర్పాటు చేసి సాగుకు అందించారు. నేడు ఎల్‌నోని ప్రభావంతో ఎండలు దడపుట్టిస్తూ చెరువులను ఎండబెడుతుండగా బోర్లు ఎండిపోగా తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ రైతులను ఆదుకుంటున్న పరిస్థితి చోటు చేసుకుంది. తెలుగుగంగ గల గలా పారుతుండగా పరివాహక ప్రాంతాల్లో పంట పొలాలు పచ్చని పైర్లతో కళ కళ కలాడుతున్నాయి.

**క్వారీ ప్రాంతాల్లో కూడా పంటల కనువిందు:**
శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలో క్వారీలు అత్యధికం. లాగే బుచ్చినాయుడు కండ్రిగ ప్రాంతాల్లో కూడా క్వారీలు అత్యధికంగా ఉన్నాయి. గంగ కాలువకు ఎడమ వైపు ఉన్న అన్ని చెరువులకు తెలుగుగంగను తూములు ఏర్పాటు చేసి అనుసంధానం చేసారు. ంరైతుల భాగస్వామ్యంతో పంట కాలువలను ఏర్పాటు చేసి ఆదుకున్నారు. దాంతో ప్రతి ఏటా రబీ, ముందస్తు ఖరీఫ్ సీజన్లలో విస్తారంగా పంటలు పండించుకుంటూ అన్నదాతలు మహారాజులుగా ఉన్నారు. పరివాహక గ్రామాల్లో అన్నదాతలు నిత్యం పొలం పనుల్లో బిజీబిజీ ఉంటూ ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నారు. తొట్టంబేడు మండలంలో 98 చెరువులకు తెలుగుగంగ నీటిని అందిస్తున్నారు. ఈ మండలంలో అధికారిక గణాంకాల మేరకు 1449 హెక్టార్లలో వరి పంటను వేసారు. ఈ మ ండలంలో 100 హెక్టార్లలలో వేరుశెనగ పంటతో పాటు 12 హెక్టార్లలో చెరుకు పంటను పండిస్తున్నారు. రెండు మండలాల్లో సుమారు 15వేల బోర్లు ఉన్నట్లు అంచనా.

## రోగులకు...
# నాణ్యమైన వైద్య సేవలు

### - వైద్యశాఖ మంత్రితో చర్చించి ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరుకు చర్యలు- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యే

చిత్తూరు, జులై 18 ప్రభాతవార్త: చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులదరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులు అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి, ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ఉషశ్రీ, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, అపోలో ఆసుపత్రి డాక్టర్ల బృందం డాక్టర్ రంగనాథ్, డాక్టర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి అందరు సలహాలు, సూచనలు అందిస్తే వాటిని స్వీకరించి అమలు చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆహ్లాదకరమైన వాతావరణం తీసుకురావడంతో పాటు ఆసుపత్రిని సుందరంగా తీర్చిదిద్దడానికి కొన్ని పనులను ఆమోదిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపీ ల్యాడ్ కింద రూ.25 లక్షలతో అపోలో వారి సహకారంతో 10 కంప్యూటర్లు కొనుగోలు చేయడం, డయాలసిస్ పేషెంట్లకు 10 పడకలు మంజూరు చేయడం, ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ డెస్క్ ఏర్పాటు, అంబులెన్స్, వాచ్‌మెన్లు, వివిధ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వానికి నివేదికలు అందించడం చేస్తామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆసుపత్రి అభివృద్ధి చేయడానికి ఏ పనులు చేపట్టాలో, వాటికి ఎంత నిధులు అవసరం అవుతాయో! అనే విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి మంజూరు చేయించాలన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆగస్టులో జిల్లా పర్యటనకు వస్తున్నారని, అప్పుడు ఆయనతో చర్చించి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి నిధులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పి.అరుణ కుమారి, సురేష్, విజయ్ కుమార్, ఎల్.రమేష్, డాక్టర్ కె.విజయకుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, ఇతర వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.




# ముందే వేడెపుట్టిస్తున్న...స్థానికం!

### అధికార కూటమికి సవాల్, వైసిపికి ప్రతిష్టాత్మకం -మొదలైన రాజకీయ సన్నాహాలు



ప్రభాతవార్త-తిరుపతి:
స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. సర్ ప్రక్రియ పూర్తి కాగానే స్థానిక ఎన్నికలు జరపడానికి ప్రభుత్వం కూడా సంసిద్ధత చూపడంతో వేడిపుట్టింది.. సెప్టెంబర్ చివరి వారంలో తొలుత నగరపాలక సంస్థ, మున్సిపల్ ఎన్నికలు జరిపించాలనేది ప్రభుత్వ ఆలోచన. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలను అధికార కూటమి ప్రభుత్వం సవాల్‌గా తీసుకుంటుండగా వైసిపి ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఈ నేపద్యంలో ఇప్పటికే అటు సిఎం చంద్రబాబునాయుడు ఇటు మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి కూడా పార్టీ శ్రేణులతో సమాలోచనలు మొదలుపెట్టారు. స్థానిక సంస్థల్లో గెలుపే ధ్యేయంగా రెండు ప్రధాన పార్టీలు ముందుకు రానున్నాయి. నియోజక వర్గాల ఇన్‌చార్జిలకు, నేతలకు కీలక దిశా నిర్దేశం చేస్తున్నారు. ఓ వైపు వైసిపి వార్డు నుంచి మండలం వరకు ఏ ఎన్నిక అయినా పార్టీ అభ్యర్థి పోటీ చేయాలనేది ప్రధాన ఎజెండాగా తీసుకుంటున్నారు. పార్టీ అభ్యర్థి పోటీలో లేకపోతే నియోజకవర్గ ఇన్‌చార్జిలను బాధ్యులను చేస్తూ కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు.
పార్టీ కోసం పనిచేసిన వారికి స్థానికంగా సీట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదే కోణంలో కూటమి పార్టీలలో అంతర్గత యుద్ధం జరుగుతోందని అంటున్నారు. జనసేన, బిజెపి పార్టీలు అధిక శాతం సీట్లు కోరే అవకాశం ఉంది. ఇదే అదనుగా టిడిపి అధిష్టానం మాత్రం శాసన సభ ఎన్నికల్లో ఇచ్చినట్టు జనసేనకు 15 శాతం, బిజెపికి ఐదు శాతం ఇస్తే చాలనే వాదన వినిపిస్తున్నారు. అయితే టిడిపి కార్యకర్తలు మాత్రం జనసేన, బిజెపి పార్టీలకు ఒక స్థానం కేటాయించినా నష్టమే అంటున్నారు. దీనికి తోడు సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపిపి, జడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేషన్ కార్పొరేటర్లు ఛైర్మన్ల ఎంపిక పూర్తిగా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిల కనుసన్నల్లో జరిగే అవకాశం ఉంది. దీంతో పలు చోట్ల పోటీ అభ్యర్థులు రంగంలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. కొన్ని చోట్ల వెన్నుపోటు రాజకీయాలు తప్పవు అంటున్నారు. 2021లో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులు ఏక పక్షంగా ఎన్నికయ్యారు. అప్పటి ప్రధాన ప్రతి పక్షం టిడిపిని నామినేషన్లు కూడా వేయనీయలేదు. ఉమ్మడి చిత్తూరు వీళ్ళలో 65 ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి దక్కించుకున్నారు. అన్ని మున్సిపాలిటీలు గెలుచు కున్నారు. అయితే అందుకు భిన్నంగా ఇప్పుడు ఒక చోట కూడా ఏకగ్రీవం కాకూడదని జగన్ పట్టుదలగా ఉన్నారనేది వైసిపి వర్గాల సమాచారం. టిడిపిలో అధికారం అడ్డుపెట్టుకుని ఏకగ్రీవాలు చేసుకునే ఎమ్మెల్యే ఒకరు కూడా లేరనే వాదన వినిపిస్తోంది. జిల్లాల పునర్విభజన తరువాత చిత్తూరు జిల్లాలో 28 మండలాలు, ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు, తిరుపతి జిల్లాలో 36 మండలాలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్, ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి మెజారిటీ సాధించి రెండు జిల్లా పరిషత్ ఛైర్మన్ లను, మున్సిపాలిటీలు గెలుచుకుంటుందా అన్నది ఓటరు నిర్ణయించాల్సి ందే. స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రం ప్రధాన రెండుపార్టీలకు ప్రతిష్టాత్మకమేననేది చర్చ మొదలైంది.

## శాస్త్ర విజ్ఞానంపై...
# ఆసక్తి పెంచుకోవాలి

### విద్యార్థులతో జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్

తిరుపతి విద్య, జూలై 18 ప్రభాతవార్త: భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి నాంది పలికిన తొలి ప్రైవేట్ రాకెట్ విక్రమ్1 ప్రయోగాన్ని తిరుపతి జిల్లా విద్యార్థులు ఉత్సాహంగా వీక్షించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 7 వేల మంది విద్యార్థులు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జరిగిన ప్రయోగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ అభివృద్ధి చేసిన విక్రమ్1 రాకెట్ ప్రయోగం భారత అంతరిక్ష రంగంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. సుమారు 350 కిలోల పేలోడ్‌ను కక్ష్యలోకి చేర్చే సామర్థ్యం కలిగిన ఈ ప్రయోగం విజయవంతం కావడంతో విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రయోగం ప్రతి దశను ఆసక్తిగా గమనిస్తూ శాస్త్రవేత్తల విజయాన్ని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ విద్యార్థులతో కలిసి ప్రయోగాన్ని వీక్షి ంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇలాంటి శాస్త్ర-సాంకేతిక విజయాలు యువతలో విజ్ఞానాసక్తిని పెంపొందిస్తాయని చెప్పారు. పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా పరిశోధన, ఆవిష్కరణలపై దృష్టి సారించి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా జిల్లా పరిపాలన, విద్యాశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ప్రయోగాన్ని వీక్షి ంచిన విద్యార్థులు భారత అంతరిక్ష రంగం సాధిస్తున్న విజయాల పట్ల గర్వం వ్యక్తం చేశారు.



# నెలన్నర రోజుల్లో చిత్తూరు ఆసుపత్రి రూపురేఖలు మార్పు



- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్

**చిత్తూరు, జులై 18 ప్రభాతవార్త:**
చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి రూపురేఖలను నెలన్నర రోజుల్లో పూర్తిగా మార్చుతామని, అలాగే చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, అపోలో సంస్థలు సమన్వయంతో సమర్థవంతమైన వ్యవస్థను అమలు చేస్తున్నాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశభవనంలో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ, అభివృద్ధి, నిధుల వినియోగం తదితర అంశాలపై ఎస్‌డిహెచ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై కలెక్టర్ సుమిత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని 45 రోజుల్లో సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మహాప్రస్థానం, సేవల మెరుగుదల, మంచినీటి సమస్య, నవజాత శిశువుల కోసం ఎస్ఎన్‌సియూలో అవసరమైన పరికరాలు, ప్రణాళికలు, మౌళిక వసతులు, ఐటి మౌళిక వసతుల అవసరాలు, పాత భవనాల మరమ్మత్తులు, క్యాథ్‌ల్యాబ్ తితర అంశాలపై సమగ్రంగా చర్చించామన్నారు. చిత్తూరు ఆసుపత్రిలో ప్రస్తుతం కేవలం 12 డయాలసిస్ పడకలు మాత్రమే వున్నాయని, అవసరాలకు అనుగుణంగా ఈ సంఖ్యను పెంచాల్సిన అవసరం వుందన్నారు. అలాగే డయాలసిస్ సేవల విస్తరణపై ప్రత్యేకంగా మరో సమావేశం నిర్వహించి పడకల సంఖ్యను పెంచే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన, సమర్థవంతమైన వైద్య సేవలు అందించడం అందరి బాధ్యత అన్నారు. అలాగే ఆసుపత్రిలో వైద్యుల సంఖ్య పెంపు, అత్యవసర కేసులను సమర్థవంతంగా నిర్వహించడం, ఆసుపత్రిలో సేవల నాణ్యత మెరుగుపరచడం వంటి అంశాలు చేపట్టాల్సి వుందన్నారు. ఇటు ప్రభుత్వం, అటు అపోలో సంస్థ వైపు నుండి మెరుగుదల కోసం తీసుకోవాల్సిన చర్యలను సమన్వయంతో అమలు చేస్తామని, ఆసుపత్రుల్లో ప్రజలకు అవసరమైన సేవలు సక్రమంగా అందుతు న్నాయా! మందులు అందుబాటులో వున్నాయా! రోగులకు సరైన సహకారం అందుతుందా! అనే అంశాలను నిరంతరం పరిశీలిస్తున్నామన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జిల్లాలోని ఆసుపత్రులను సందర్శించి అక్కడి సమస్యలు, అవసరాలు, సేవల అమలు తీరును పరిశీలించి ప్రజలకు అవసరమైన ప్రతి అంశంను గుర్తించి దశల వారీగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు కేవలం సమావేశ నిర్ణయాలుగా మిగిలిపోకుండా వాటి అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## రేపు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్-2026 అందజేత

**చిత్తూరు, జులై 18 ప్రభాతవార్త:**
2026 మార్చిలో జరిగిన ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల్లో వివిధ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల నుండి అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించడానికి జిల్లా కేంద్రం చిత్తూరులోని జడ్పీ సమావేశ భవనంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుండి షైనింగ్ స్టార్స్ అవార్డ్స్-2026 నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జీ జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారన్నారు.

## ఇసుక మాఫియాను అడ్డుకున్న విజయానందరెడ్డి



**చిత్తూరు, జులై 18 ప్రభాతవార్త:**
చిత్తూరు నగర పరిధి నుండి అనునిత్యం తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైకు జోరుగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను శనివారం చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి అడ్డుకున్నారు. చిత్తూరు నగర శివారు ప్రాంతంలో వున్న పూనేపల్లి క్రాస్ పరిసరాల్లో భారీ ఇసుక డంప్ ఏర్పాటు చేసుకుని అక్కడి నుండి అక్రమార్కులు ఇసుకను ట్రిప్పర్లు, లారీల ద్వారా చెన్నైకు తరలిస్తున్నారు. ఈ విషయం తెలియడంతో శనివారం వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఇసుక డంప్ వున్న ప్రదేశానికి చేరుకున్నారు. డంప్ నుండి చెన్నైకు అక్రమంగా ఆరు లారీల్లో చెన్నైకు తరలించడానికి ఇసుకను లోడ్ చేస్తుంటంతో నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి, వైకాపా నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అడ్డుకున్నారు. ఎంసి విజయానందరెడ్డి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ప్రాంతకు వెళ్ళే సమయానికి జెసిబి ద్వారా లారీల్లో ఇసుకను లోడ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇసుక మాఫియాకు ప్రధాన సూత్రదారి అయిన ప్రసాద్ అక్కడి నుండి పరారీ కావడానికి ప్రయత్నించగా స్థానికులు అతనిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎంసి విజయానందరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి నుండి రోజుకు 20 లారీల ఇసుక అక్రమంగా చెన్నైకి తరలించి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపై ఎంసి విజయానందరెడ్డి ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు తెలియజేశారు.

## పక్కాగా ట్రాఫిక్ నిబంధనలు



**పెనుమూరు, జులై 18 ప్రభాతవార్త:**
మండల పరిధిలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా పాటించాలని పెనుమూరు ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మండల కేంద్రం పెనుమూరులో నిత్యం రద్దీగా వుండే బస్టాండ్ కూడలి ప్రాంతంలో దుకాణాలకు ఎదురుగా వాహనాలను నిలుపుదల చేసి ట్రాఫిక్‌ను తీవ్ర అంతరాయం కల్పిస్తున్నారన్నారు. అలాగే బస్టాండ్ లోపల ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని, తమ సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలని వాహనదారులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం కన్పించడం లేదన్నారు. ఇకపై ట్రాఫిక్ నిబంధనలు పాటించిన వారిపై జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. పోలీసులు కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాలన పార్కింగ్ చేయాలని, అలాగే నాయకుల పుట్టినరోజులు పురస్కరించుకుని బస్టాండులో వేడుకలు నిర్వహిస్తూ బాణసంచా పేల్చుతూ ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్నారని తమకు సమాచారం వుందని, ఇకపై తమ అనుమతి లేకుండా ఇలాంటి కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**గుడిపాల, జులై 18 ప్రభాతవార్త:**
మండల కేంద్రం గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా నూతనంగా నిర్మించిన జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌ను శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ గుడిపాల మండలం కేంద్రంలో సుమారు రూ.60 లక్షల జడ్పీ నిధులతో ఆరు గదులు, మూడు గోడౌన్ల నిర్మాణంతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించడం జరిగిందన్నారు. స్థానిక సంస్థలకు ఆదాయం పెంచడానికి ఇలాంటి నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అధికారులు, పాలకులు సమన్వయంతో విధులు నిర్వహిస్తే ప్రజలకు మరింత ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపట్టవచ్చునన్నారు. ఈ దిశగా నాయకులు కృషి చేసి మండలంను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్ళాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరు గ్రామ పంచాయతీల స్వర్ణ గ్రామ కార్యాలయాలకు యుపిఎస్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఎంపిడిఓ శిరీష, తహసిల్దారు శ్రీనివాసులు, పిఆర్ ఎఇ ప్రసాద్, మాజీ ఎంపిపి దీపశ్రీ అనిల్‌కుమార్, నాయకులు ధనసింగ్, బాలసుబ్రమణ్యంయాదవ్, శరత్‌బాబు, బాలాజీ నాయుడు, శింబు, తుమ్మల లలిత తదితరులు పాల్గొన్నారు.

## అధిక రుసుం వసూలు చేయొద్దు : ఆర్డీఓ



**కుప్పం, జూలై 18 ప్రభాతవార్త:**
కుప్పం ప్రాంతంలో ఉన్న గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల నుంచి అధిక రుసుం వసూలు చేయరాదని కుప్పం ఆర్డీఓ షేక్ మహ్మద్ హుసేన్ ఆదేశించారు. శనివారం సిఎం చంద్రబాబునాయుడు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్ ఆదేశాలతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, సరఫరా సిబ్బందితో స్థానిక మండల కార్యాలయంలో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. సిలిండర్లు ఇంటింటికి వెళ్లి డెలివరీ చేసే సమయంలో వినియోగదారులనుంచి అధిక నగదు వసూలు చేయరాదన్నారు. అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పిపిపి కార్యక్రమంపై వారికి అవగాహన కల్పించారు. వినియోగదారులకు మెరుగైన సేవలను గ్యాస్ డీలర్లు అందించాలని ఆదేశించారు. ఎవరైనా అధిక నగదు వసూలు చేస్తే తహశీల్దార్లు లేదా తన దృష్టికి తేవాలని ఆర్డీఓ పేర్కొన్నారు. సమావేశంలో తహశీల్దార్లు రమేష్‌బాబు, సీతారాం, కౌలేష్ పాల్గొన్నారు.

## తెదేపా కార్యకర్త మృతి.. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్‌చే నివాళి

**కుప్పం, జూలై18 ప్రభాతవార్త:**
మున్సిపల్ పరిధి అనిమిగానిపల్లికి చెందిన తెదేపా కార్యకర్త, వీరాభిమాని అయిన వడివేలు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం గ్రామానికి చేరుకుని వడివేలు మృతదేహంకు నివాళులు అర్పించారు. అతని కుటు ంబసభ్యులతో మాట్లాడి ఓదార్చారు. పార్టీ తరపున కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గోపీనాథ్,డాక్టర్ వెంకటేష్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, కౌన్సిలర్ సోమశేఖర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## పేదల్ని ఆదుకునేది సిఎం చంద్రబాబే

- టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్



**కుప్పం, జూలై 18 ప్రభాతవార్త:**
పేద ప్రజల్ని ఆదుకుని వారికి అండగా నిలిచేది సిఎం చంద్రబాబునాయుడేనని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని సజ్జలపల్లి గ్రామంలో వసంత, గాయత్రి, షణ్ముగంలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక నేతలతో కలిసి అందజేశారు. పేదల ఆరోగ్యం పట్ల సిఎం చంద్రబాబు చొరవ చూపుతున్నారని ఆయన తెలిపారు. ఈసందర్భంగా లబ్ధిదారులు తమను ఆదుకున్న సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు నాగరాజు, కృష్ణయ్య, బగ్గిడి వెంకటేష్,కదిరప్ప,బాలకృష్ణ,నరసింహులు, సంతూరప్ప, ఈశ్వర్, మణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజంకు కృషి చేయాలి

-పర్యావరణవేత్త పాలేటి శివాజీ



**కుప్పం, జూలై 18 ప్రభాతవార్త:**
ప్లాస్టిక్ రహిత సమాజ ం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ పాలేటి శివాజీ పేర్కొన్నారు. కుప్పం ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్వర్యంలో శనివారం కుప్పం డిగ్రీ కాలేజ్‌లో పర్యావరణ స్థిరత్వం - ప్లాస్టిక్ రహిత సమాజం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం తీవ్ర ంగా దెబ్బతింటోందన్నారు. యువత ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. కాలేజ్ వైస్‌ఛైర్మన్ సాగర్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, కోఆర్డినేటర్ నగేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మలేరియా..డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

**కుప్పం, జూలై 18 ప్రభాతవార్త:**



మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపల్లి పిహెచ్‌సి డాక్టర్ సుభాష్ రాజా పేర్కొన్నారు. శనివారం నూలుకుంట గ్రామంలో విద్యార్థులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా లక్షణాలు, వ్యాప్తి విధానం, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ముత్తుకుమార్, గౌతమి,గీత, ఆశ వర్కర్లు లక్ష్మి, పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థినిల సంక్షేమానికి పకడ్బందీ చర్యలు

- కలెక్టర్, ఎమ్మెల్యేలు గురజాల, అరణి శ్రీనివాసులు



**చిత్తూరు, జులై 18 ప్రభాతవార్త:**
విద్యార్థినిల సంక్షేమం కోసం ప్రభుత్వం పక్కా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులులు పేర్కొన్నారు. చిత్తూరులోని బిఎస్ కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థినిల కోసం నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనంను శనివారం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, అరణి శ్రీనివాసులులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం, ప్రజా ప్రతినిధులు, దాతలు అందరి సమన్వయంతో హాస్టల్ నిర్మాణం పూర్తయ్యిందని, ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 120 మంది విద్యార్థినిలకు సురక్షితమైన వసతి కల్పించే అవకాశం ఏర్పడిందన్నారు. బయట గదులు అద్దెకు తీసుకుని వుండే విద్యార్థినిలకు ప్రతి నెల వేల రూపాయలు ఖర్చు తగ్గడంతో పాటు హాస్టల్‌లో వుంటే భద్రత సైతం లభిస్తుందన్నారు. ప్రస్తుతం హాస్టల్ ఏర్పాటు కావడంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుం దన్నారు. రానున్న రెండు సంవత్సరాల పాటు పూర్వ విద్యార్థులు అభివృద్ధికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి, రన్నింగ్ ట్రాక్, లైటింగ్, క్రీడా వసతుల ఏర్పాటు కోసం రూ.25 లక్షలతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మాట్లాడుతూ 97 సంవత్సరాల చరిత్ర వున్న బిఎస్ కన్నన్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థినిల కోసం హాస్టల్ నిర్మాణం చేపట్టడం సంతోషంగా వుందని, దాతల సహకారం, ట్రస్టుల నిధులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో సుమారు రూ.1.10 కోట్ల వ్యయంతో నాణ్యమైన హాస్టల్ నిర్మాణం పూర్తయ్యిందన్నారు. తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు మాట్లాడుతూ బిఎస్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎంతోమంది కలెక్టర్లు, వైద్యులు, ఇంజనీర్లు, ప్రజా ప్రతినిధులను అందించిన గొప్ప విద్యాసంస్థ అని, పాఠశాలలో బాలికల హాస్టల్ అవసరంను గుర్తించి కలెక్టర్ చొరవతో ప్రజాప్రతినిధులు, దాతలు కలిసి ఈ భవనంను నిర్మించడం అభినందనీయమన్నారు. చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం విజ్ఞప్తికి స్పందించి కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చొరవతో హాస్టల్ నిర్మాణం సాధ్యమైందన్నారు. హాస్టల్ ఏర్పాటులో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాటు బాలికలకు అవసరమైన మెరుగైన వసతి సౌకర్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షణ్ముగంరెడ్డి, ప్రిన్సిపల్ సయ్యద్ మౌలా, పాఠశాల హెడ్మాస్టర్ కోమల, పూర్వ విద్యార్థుల సంఘ కార్యవర్గ సభ్యులు, పూర్వ విద్యార్థులు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## కాణిపాకంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ



**కాణిపాకం, జూలై 18 ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆదేశాల మేరకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స ్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మొదటగా దేవస్థానం అతిథి గృహం వద్ద ఆలయ సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆలయ ఆలయ అధికారులు, సిబ్బందితో కలసి ఆలయ మాఢా వీధులు,బస్టాండు మీదుగా ర్యాలీ నిర్వహించారు.అలాగే పారిశుద్ధ్యంపై తోపుడుబండ్లు, భక్తులకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆలయశుభ్రత అందరి బాధ్యత, పచ్చదనం పరిశుభ్రత ప్రగతికి సోపానాలు అంటూ నినాదాలు చేశారు. అలాగే దేవస్థానం పరిసరాల్లో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదించాలని వ్యాపారస్థులను ఛైర్మన్, ఈఓలు ఆదేశించారు. ఈ కార్యాక్రమంలో ఆలయ ఏఈఓలు ధనంజయ,ఎస్వీ.కృష్ణారెడ్డి హరిమాధవరెడ్డి,ధనుంజయ,సూపరెంటెంట్ కోదండపాణి, ఆలయ, పారిశుధ ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



**కాణిపాకం, జూలై 18 ప్రభాతవార్త:**
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వా మివారి దేవస్థానంలో అమలవు తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకా నికి ఓ భక్తుడు శనివారం లక్ష రూపా యలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తిరుపతికి చెందిన గుర్రప్పనాయుడు అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు లక్ష రూపా యలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ,ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో పెర్గిగిన వారాంతపు రద్దీ

-కిక్కిరిసిన ఆలయ పరిసరాలు



**కాణిపాకం, జూలై 18 ప్రభాతవార్త:**
సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయ దర్శనార్థం అశేషంగా తరలివచ్చిన భక్తులతో శనివారం కాణిపాకం ఆలయంలో వారాంతపు రద్దీ నెలకొంది. సాధారణంగా వారంతపు రోజులు శని, ఆదివారాల్లో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శనివారం వారాంతపు రోజు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల మాడా వీధుల్లో బారులు తీరి నిలబడ్డారు.అలాగే ఆలయ మాడా వీధులు, పరిసరాలన్ని కిక్కిరిసిపోయాయి. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. రద్దీ కారణంగా ఆలయ పరిసరాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

## అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని

- భర్త హత్య కేసులో భార్య, ప్రియుడు,మరో నలుగురు అరెస్ట్



**కుప్పం, జూలై 18 ప్రభాతవార్త :**
గుడుపల్లె మండలం మల్లప్పకొండ ప్రాంతంలో వ్యక్తి దారుణహత్యకు సంబంధించిన కేసులో వ్యక్తి భార్య, ఆమె ప్రియుడుతో సహా మరో నలుగురిని అరెస్ట్ చేసినట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. శనివారం డిఎస్పీ పార్థసారథి రూరల్ సిఐ మల్లేష్ యాదవ్‌తో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాంతిపురం మండలం బోయనపల్లికి చెందిన హాసినికి 2024లో తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లాకు చెందిన రమేష్‌తో వివాహం అయిందన్నారు. వీరికి ఏడాదిన్నర వయసుగల పాప ఉందన్నారు. కాగా హాసిని పెళ్లికి ముందే తన గ్రామానికే చెందిన గంగాధర్ అనే యువకుడిని ప్రేమించి ందన్నారు. ఆమెకు పెళ్లయ్యాక కూడా గంగాధర్‌తో అక్రమ సంబంధం కొనసాగించిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న గంగాధర్ తన భార్య హాసినిని మందలించాడు. దీంతో భర్తను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న హాసిని తన ప్రియుడు గంగాధర్‌తో మాట్లాడిందన్నారు. ఈనెల 14వతేది మల్లప్ప కొండలో మొక్కులు చెల్లించుకోవాలని హాసిని తన భర్త,పాపతో వచ్చిందన్నారు. అప్పటికే అక్కడకు చేరుకున్న హాసిని ప్రియుడు గంగాధర్, అతని స్నేహితులు అయిన పవన్, శేఖర్, సంతోష్, సురేంద్రలు రమేష్‌ను తీసుకెళ్లి హత్య చేశారన్నారు. ఈ సంఘటనలో మరో ఇద్దరు నిందితులు సైతం ఉన్నారని వారు పరారీలో ఉన్నట్లు డిఎస్పీ తెలిపారు. వారిని సైతం త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. నిందితుల నుంచి రెండు కత్తులు, రెండు టువీలర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా నిందితుల్లో ఒకడైన పవన్‌పై ఇప్పటికే 3కేసులు ఉన్నాయన్నారు. ఈ హత్యకు పాల్పడిన నిందితులపై రౌడీషీట్లు తెరవడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రీకాంత్, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎంచే అవార్డు అందుకున్న కమీషనర్



**కుప్పం, జూలై 18 ప్రభాతవార్త:**
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ అధ్వర్యంలో చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయిలో కుప్పం మున్సిపాలిటీ రెండో ర్యాంకు సాధించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శనివారం సిఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం సమక్షంలో కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావుకు అవార్డును అందజేశారు. మే 23నుంచి జూన్ 20వతేది వరకు ఆపరేషన్ క్లీన్‌స్వీప్ కార్యక్రమంను మున్సిపాలిటీలో చేపట్టారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఈ ఘనత కుప్పం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టరు, పారిశుధ్య కార్యదర్శులు, మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులకు లభించిందన్నారు. వీరందరి సహకారంతో కుప్పం మున్సిపాలిటీకి అవార్డు లభించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## స్వచ్ఛకుప్పం సాధనకు ప్రజలు సహకరించాలి

- ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, జూలై 18 ప్రభాతవార్త:**
సిఎం చంద్రబాబునాయుడు తలపెట్టిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ కుప్పం సాధనకు ప్రజలు మరింత సహకరించాలని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం స్థానిక చంద్రన్న వ్యవసాయ మార్కెట్ యార్డులో స్వచ్ఛాం ధ్ర కార్యక్రమంను ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు చేపట్టారు. స్వయంగా వారు పారిశుధ్య పనులు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిశుభ్రత కేవలం బాధ్యత మాత్రమే కాదని అభివృద్ధికి తొలిమెట్టు అన్నారు. ప్రతి వ్యక్తి స్వచ్ఛతను తన బాధ్యతగా భావించి భాగస్వామ్యం వహిస్తే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర సిద్ధిస్తుందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు విజన్‌కు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి అందరి లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మాజీ ఎంపిపి డాక్టర్ వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జులు కన్నన్, సోమశేఖర్, ఎఎంసి సిబ్బందిపాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## మైనర్ బాలికపై లైంగిక వేధింపులు!

**బంగారుపాళ్యం, జులై 18 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గుంతూరు గ్రామ పంచాయతీ పెద్దవంక గ్రామంకు చెందిన ఓ మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు గురి చేసిన వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు. రాగిమానుపెంట గ్రామంకు చెందిన చిన్నబ్బ కుమారుడు అనంతబాబు(22) శుక్రవారం రాత్రి పెద్దవంకకు చెందిన ఓ మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు గురి చేశాడు. ఈ విషయంను గుర్తించిన బాలిక తల్లిదండ్రులు అనంతబాబును పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు అనంతబాబుపై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

## విశ్రాంతి ఉద్యోగుల కార్యవర్గం

**బంగారుపాళ్యం, జులై 18 ప్రభాతవార్త:**
స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం విశ్రాంతి ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఆ సంఘ నూతన అధ్యక్షులుగా సురేంద్రనాథ్, కార్యదర్శిగా సుమతి, అసోసియేట్ అధ్యక్షులుగా గోవిందన్, ఉపాధ్యక్షులుగా విజయకుమార్, అరుళమణి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శివరామారావు, మురగయ్య, సుబ్రమణ్యంరాజు, కోశాధికారిగా గోవిందరాజులు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా గురురాజారావు, భాస్కర్‌లు వ్యవహరించారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డు ఎంపిక

**వడమాలపేట, జులై 18 ప్రభాతవార్త:**




వడమాలపేటలోని శ్రీ విశ్వవాణి స్కూలుకు చెందిన జె.సేవ్యశ్రీ, జి.నవీన్‌కుమార్‌లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డు ఎంపికయ్యారు. మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలలో సేవ్యశ్రీ 592 మార్కులు, నవీన్‌కుమార్ 589 మార్కులు సాధించారు. వీరి ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డు ఎంపిక చేసింది. సోమవారం తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ మైదానంలో జరిగే సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు, డీఈవో కెవిన్ కుమార్‌లు నగదు పురస్కారంతో పాటు మెడల్, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. షైనింగ్ స్టార్స్ అవార్డు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

## సదాశివకోన రోడ్డు ఆక్రమణలపై సమగ్ర సర్వే

**వడమాలపేట, జులై 18 ప్రభాతవార్త:**



సదాశివకోనకు వెళ్లే రోడ్డులో ఆక్రమణలు గుర్తించడానికి సమగ్రంగా సర్వే నిర్వహిస్తున్నట్లు తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ తెలిపారు. శనివారం వడమాలపేట మండలం బైపాస్‌రోడ్డు వద్ద టీటీడీ ప్లాట్లపక్కన సదాశివకోనకు వెళ్లే రోడ్డును ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సదాశివకోనకు వెళ్లే రోడ్డు ఆక్రమణలను గుర్తించడానికి వచ్చినట్లు తెలిపారు. రోడ్డు ఆక్రమణకు గురైందా, ఎంత మేరకు అనేది పూర్వపు రికార్డులు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. సమగ్రంగా సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పూర్తి స్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. రోడ్డు పక్క రైతులు తమ భూములకు సంబంధించిన రికార్డులు చూపి సహకరించాలని కోరారు. పరిశీలనలో తహసీల్దార్ జరీనా, ఆర్ఐ జానీబాషా, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

## పళ్లతోటల పెంపకం పథకం సద్వినియోగం చేసుకోవాలి

**శాంతిపురం, జులై 18 ప్రభాతవార్త:**
విబిజి రామ్‌జీ పథకంలో రైతులు పళ్ల తోటల పెంపకం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎపిఆర్ కుమార్ కోరారు. శనివారం ఆయన పళ్ల తోటల పె ంపకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మండలంలో 75 ఎకరాల్లో పళ్ల తోటల పెంపకం మంజూరు చేసిందన్నారు. 48మంది రైతులు లబ్దిదారులుగా ఉన్నారన్నారు. ఈ పళ్ల తోటలకు మూడేళ్ల దాకా సంరక్షణ ఖర్చులు, ఎరువులు, మొక్కల ఖర్చులను ప్రభుత్వం పూర్తి రాయితీతో అందిస్తుందన్నారు. బిల్లుల చెల్లింపులో తేడాలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ చిన్నరెడ్డెమ్మ, టిఎ,ఎఫ్‌ఎలు పాల్గొన్నారు.

## బందార్లపల్లిలో విషాద ఛాయలు

**-వృద్ధదంపతుల హత్యతో ఉలిక్కిపడ్డ గ్రామం**

**రామకుప్పం, జులై 18 ప్రభాతవార్త:**
మండలంలోని బందార్లపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన వృద్ధదంపతులు వెంకటేశు, పార్వతమ్మ శుక్రవారం రాత్రి గ్రామ సమీపంలో టూవీలర్‌లో వస్తుండగా దారుణ హత్యకు గురైన విషయం విదితమే. పోలీసు అధికారులు మృతదేహాలకు పంచనామా నిర్వహించిన అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. శనివారం మృతదేహాలకు అంత్యక్రియలను కుటుంబీకులు నిర్వహించారు. వృద్ధదంపతుల దారుణహత్యతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. కుప్పం డిఎస్పీ పార్థసారథి నేతృత్వంలో మూడు పోలీసు బృందాలు ఈ కేసు విషయం ఒగా విచారిస్తున్నాయని తెలిసింది. ఆస్తితగాదాల నేపథ్యంలోనే వృద్ధదంపతులను హతమార్చిఉంటారనే అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేశారు.

## రైతులకు పశుదాణా పంపిణీ

**రామకుప్పం, జూలై 18 ప్రభాతవార్త:** మండలంలోని ఆవులకుప్పం గ్రామంలో తెదేపా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి వెంకటాచల ం, పశువైద్యురాలు జయశ్రీ రైతులకు పశుదాణాను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వెంకటాచలం మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాబు, రైతులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**రామకుప్పం, జూలై 18 ప్రభాతవార్త :** మండలంలోని మణీం ద్రం పంచాయతీకి చెందిన లక్ష్మీపతి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కాగా అతని చికిత్సల నిమిత్తం సిఎం చంద్రబాబునాయుడు 1.13లక్షల సిఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేశారు. శనివారం టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ రవిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ మంజునాథరెడ్డి లక్ష్మీపతి కుటుంబానికి చెక్కును అందించారు. కార్యక్రమంలో నేతలు రామలింగారెడ్డి, నాగరాజు, మోహన్‌బాబు, రమేష్, మంజునాథ్, భానుమూర్తి, వెంకటస్వామి, దినేష్ కుమార్, వెంకటమునెప్ప, గోవిందప్ప, నారాయణరెడ్డి, విజయ్, సురేష్‌నాయుడు, రామకృష్ణప్ప పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి

**-రాయలసీమ పట్టబద్రుల ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి**



**రైల్వేకోడూరు రూరల్, జూలై 18 ప్రభాతవార్త :**
రైల్వే కోడూరు నియోజకవర్గం లోని ఓబులవారిపల్లి మండలం జిఎంసి బాలయోగి గురుకుల పాఠశాల నందు చాలా సమస్యలు ఉన్నాయని రాయలసీమ పట భద్రుల ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వై జయప్రకాష్ తో గురుకుల పాఠశాలన్ని ఆయన తనిఖీ నిర్వహించి ప్రిన్సిపల్ మన్సూర్ అలీ తో చర్చించారు. పూర్తిస్థాయిలో పాఠశాల నందు చాలా సమస్యలు ఉన్నాయని దీనిపై సంబంధిత అధికారులు తెలియజేస్తే జిల్లా కలెక్టర్ తో చర్చించి విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పిస్తామని రాంభూపాల్ రెడ్డి అన్నారు. దీంతో ఎంతో ఉన్నత భావాలతో రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలను అంకితభావంతో ఏర్పాటు చేసి విద్యార్థుల నూతన భవిష్యత్తుకు ఇక్కడ నుండి ప్రారంభం అవుతుందని కానీ ఈ గురుకుల పాఠశాలలో వసతులు అరకొరగా ఉన్నాయని దీనిపై త్వరలోనే జిల్లా కలెక్టర్ ను కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మంగంపేట యువనాయకులు తల్లెం రమణ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ పటాన్ మోలతో పాటు కూటమికి చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది




**రైల్వేకోడూరు రూరల్, జూలై 18 ప్రభాతవార్త :** రైల్వే కోడూరు మండలంలో సచివాలయ సిబ్బంది సమయపాలన లేకుండా వారి ఇష్ట రాజ్యంగా విధులకు హాజరవుతున్నారని మండలంలో ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా 21 పంచాయతీల్లో ఉన్న సచివాలయ సిబ్బంది కొంతమంది విధులకు రాకుండానే క్యాంపులు అని చెప్పి బయట తిరగడం జరుగుతుందని అక్కడికి వెళ్లిన అర్జీదారులు ఫిర్యాదు చేస్తున్నారు. ముఖ్యంగా దూరపు ప్రాంతాల నుంచి వస్తే సచివాలయం సిబ్బంది ఎటువంటి సమయపాలన లేకుండా విచ్చలవిడిగా వారి ఇష్ట ప్రకారంగానే విధులు నిర్వహిస్తున్నారని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా విమర్శిస్తున్నారు. పూర్తిగా సచివాలయానికి వెళ్లకుండా కూడా కొంతమంది బయట తిరగడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపి పర్యవేక్షణ నిర్వహిస్తే కొంతవరకు సచివాలయ సిబ్బందిపై సంబంధిత

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం



**పుల్లంపేట, జూలై 18 ప్రభాతవార్త :** పుల్లంపేట ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని రైతు భరోసా కేంద్రం దగ్గర శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర భాగంగా మండల అభివృద్ధి అధికారి పోతుగుంట జయశ్రీ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఇదేవిధంగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతలను స్వీకరించి పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో మొక్కల పెంపకంలో అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల దగ్గర, ప్రభుత్వ పాఠశాలల దగ్గర మొక్కలు నాటి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు టెక్నికల్ అసిస్టెంట్లు, పుల్లంపేట ఫీల్డ్ అసిస్టెంట్ బొగ్గడి రామచంద్ర రెడ్డి లు పాల్గొన్నారు.

## రైతులు పంట బీమా చేసుకోవాలి

**రైల్వే కోడూరు అర్బన్, జూలై 18ప్రభాతవార్త:**
రైల్వే కోడూరు నియోజకవర్గం లోని రైతులందరూ పంట బీమా చేసుకోవాలని, పంట నష్టం జరగకుండా బీమాతో సరిచూసుకోవాలని కోడూరు వ్యవసాయశాఖ అధికారి తెలియజేశారు. ఖరీఫ్‌సంవత్సరానికి దిగుబడి ఆధారిత బీమా పథకం పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత భీమా పథకం క్రింద వేరుశనగ మరియు అరటి పంటలు ఎంపిక చేయబడినవి అన్నారు. వరి పంటకు వేరుశనగ పంటకు, అరటి పంటకు మండలాన్ని బీమా యూనిట్‌గా పరిగణిస్తారన్నారు. రైతులు ప్రీమియం ఆగస్టు 15వ తేదీ లోపు చెల్లించాలన్నారు. ఇతర వివరాలను వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

## బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి.

**చిట్వేలి, జూలై 18, ప్రభాతవార్త:**



అనారోగ్యంతో ఆర్థిక భారం పడుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తూ ఉందని మండల టిడిపి బాధ్యుడు కాకర్ల నాగార్జున అన్నారు. శనివారం మండల పరిధిలోని కేకే వడ్డేపల్లి గ్రామానికి చెందిన వల్లెపు రాజమ్మ కు 43600, మిట్టపల్లి గ్రామానికి చెందిన ఈరబత్తిన పెంచలమ్మకు 40960 రూపాయల నగదు చెక్కులను లబ్ధిదారుల ఇంటి వద్ద స్వయంగా అందించారు. తన దగ్గరికి వచ్చిన ప్రతి బాధితునికి సహాయం అందేలా కృషి చేస్తున్నానని, ఇందుకు సిఫారసు చేస్తున్న స్థానిక వాసి, రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ కె కె చౌదరికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. లబ్ధిదారులు కాకర్ల నాగార్జునకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బాలు రామాంజనేయులు నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## పాఠశాలలో వ్యవసాయశాఖచే శిక్షణ కార్యక్రమం



**నాగలాపురం, జూలై 18 ప్రభాతవార్త:** నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం భూసార పరీక్ష ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భూసార పరీక్షా కేంద్రం తిరుపతి, జిల్లా వనరుల కేంద్రం, తిరుపతి, సత్యవేడు మండల వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహించాయి. భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారులు పుష్పావతి, కుముద భూసార పరీక్ష కోసం మట్టి నమూనాలను సేకరించే సరైన విధానం, నమూనాలు తీసుకునేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ భూమి సారాన్ని పరిరక్షించడంలో భూసార పరీక్షల ప్రాధాన్యతను వివరించారు. సత్యవేడు మండల వ్యవసాయ అధికారి చిట్టిబాబు మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా పంట సాగు ఖర్చు తగ్గడంతో పాటు ఎరువుల సమర్థ వినియోగం సాధ్యమవుతుందని, పర్యావరణపరిరక్షణకు కూడా ఇవి దోహదపడతాయని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో 8,9వ తరగతుల విద్యార్థులు, సత్యవేడు గ్రామ వ్యవసాయ సహాయకుడు భరత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పంట బీమా చేసుకోవాలని రైతులకు పిలుపు

**పుత్తూరు రూరల్, జూలై 18 ప్రభాతవార్త:** 2026-27 ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై) ద్వారా రైతులు తప్పని సరిగా పంట బీమా చేసుకోవాలని పుత్తూరు వ్యవసాయశాఖ అధికారి ఎస్.కోదండయ్య కోరారు. ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ వరి పంటను గ్రామ యూనిట్‌గా వేరువనగ పంటను మండల యూనిట్‌గా, సజ్జ పంటను జిల్లా యూనిట్‌గా పరిగణిస్తారని తెలిపారు. వరి, సజ్జ పంటలకు తిరుపతి జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ అమలు సంస్థగా, వేరుశనగ పంటకు టోక్యో ఇన్సూరెన్స్ కంపెనీ అమలు సంస్థగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఎకరానికి రూ.168 ప్రీమియం చెల్లిస్తే పూర్తి పంట నష్టం సంభవించినప్పుడు రూ.42 వేల వరకు బీమా రక్షణ లభిస్తుందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి ఎస్.కోదండయ్య విజ్ఞప్తి చేశారు.

## వైఎస్ఆర్‌సిపికి ఎంపిటిసి రాజీనామా



**రామచంద్రాపురం, జూలై 18 ప్రభాతవార్త:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి నడవలూరు ఎంపిటిసి జ్ఞానమ్మ శనివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా నెన్నూరులోని తమ స్వగృహంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో పార్టీ వీడుతున్నామని, తమ రాజీనామా పత్రాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి పంపినట్లు తెలిపారు. తమతో పాటు చంద్రగిరి నియోజకవర్గ వాలంటీర్ విభాగం కన్వీనర్ టి.గిరిధర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సిద్దముని రెడ్డి, మండల బిసి సెల్ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, రైతు విభాగం అధ్యక్షుడు సదాశివరెడ్డి, యువత నాయకుడు ప్రసాద రెడ్డి, మరి కొంత మంది పార్టీని వీడి ఆదివారం ఎంఎల్‌ఏ పులివర్తి నాని సమక్షంలో టిడిపిలో చేరుతున్నట్లు తెలిపారు.

## బలిజలకు గవర్నర్ కోటాలో ఎంఎల్‌సి ఇవ్వాలి!



**రామచంద్రాపురం, జూలై 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అత్యధిక శాతంలో వున్న బలిజలకు త్వరలో గవర్నర్ కోటాలో ఖాళీ అయ్యే ఎంఎల్‌సి స్థానాలలో ఒకటి బలిజలకు కేటాయించాలని కాపు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గోపి రాయల్ కోరారు. శనివారం రామచంద్రాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమలోని 52 నియోజకవర్గాలలో ఒక్క తిరుపతి నియోజకవర్గంలో ఎంఎల్‌ఏ మాత్రమే బలిజ సామాజిక వర్గమని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు బలిజ సామాజిక వర్గానికి సమ న్యాయం చేయాలని కోరారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లో 5 శాతం బలిజలకు కేటాయించాలన్నారు. అనంతరం బలిజ సంఘం నాయకుడు దివంగత ముద్రగడ పద్మనాభంకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు యారం సిద్దయ్య రాయల్, యశ్వంత్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## కమ్మపల్లి పిహెచ్‌సిలో స్వచ్చాంధ్ర స్వర్ణాంధ్ర



**రామచంద్రాపురం, జూలై 18 ప్రభాతవార్త:** కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఏపిఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు ఆధ్వర్యంలో స్వచ్చాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరోగ్య కేంద్రంలో పిచ్చిమొక్కలను తొలగించి, పరిసరాలలోని గదులు, ఆరోగ్య పరికరాలను పరిశుభ్రం చేసి, పరిసరాలలో పండ్ల చెట్లు, ఔషధ మొక్కలు నాటి నీరుపోశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ చంద్రప్రసాద్, సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళ వర్సిటీలో...స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

**తిరుపతి, జులై 18ప్రభాతవార్త:**



ఉన్నత విద్యా మండలి కమిషనరేట్ ఆదేశాలతో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో శనివారం స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయ ప్రాంగణం, తరగతి గదులు ప్రయోగశాలల పరిశుభ్రత చేపట్టారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారులు, ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## స్వచ్ఛంధ్రాలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే

**తిరుపతి, జూలై 18 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇందిర ప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ (ఎఫ్.ఏ.సి), నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై బల్క్ వేస్ట్ జనరేటర్ ను ప్రారంభించారు. ఒక టన్ను వేస్ట్ ను 24 గంటల్లో కంపోస్ట్ గా బల్క్ వేస్ట్ జనరేటర్ మారుస్తుందని అధికారులు ఎమ్మెల్యే కు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని తెలిపారు. ప్రజలు తమ ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుతారో అలాగే వీధిని, నగరాన్ని ఉంచడంలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రికైన స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర ను విజయవంతం మన అందరి బాధ్యత అని చెప్పారు. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు పరిశుభ్రతలో తిరుపతి ఆదర్శ నగరమన్న భావన కలిగే విధంగా నిలపాలని విజ్ఞప్తి చేశారు. బల్క్ వేస్ట్ జనరేటర్ లను వ్యాపారస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములై స్వచ్ఛ తిరుపతి స్థాపనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసికుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, డి.ఈ.లు రమణ, రాజు, మేనేజర్ హాసీమ్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కేవీబీపురంలో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



**కేవీబీపురం, జూలై 18 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలోని ఆరె గ్రామంలోని రిజర్వాయర్ వద్ద ఎమ్మెల్యే ఆదిమూలం శనివారం భూమిపూజ నిర్వహించారు. శనివారం కేవీబీ పురం మండలంలో ఎమ్మెల్యే ఆదిమూలం, ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు, బూత్ కమిటీ అధ్యక్షుడు కోనేటి సుమన్‌లు పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆయన కుమారుడు సుమన్‌లను కేవీబీ పురం నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్న తరువాత కేవీబీ పురం సాయిబాబా ఆలయంలో పూజలు చేసి అక్కడి నుంచి పాదయాత్రగా మండల పరిషత్ కార్యాలయం వరకు వచ్చి సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోనేటి సుమన్ మాట్లాడుతూ పెద్దలు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని, ఈ మండలంలో, నియోజకవర్గంలో ఊహించని స్థాయిలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లను టీడీపీ ఖాతాలోకి వేసుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడ వర్గాలు లేవు విబేధాలు లేవు ఒకే వర్గం చంద్రబాబు నాయుడు గారి వర్గం మన కుటుంబం తెలుగుదేశం పార్టీ మన విబేధాలు పాలనాపరమైన విషయాల్లో ప్రతిపక్షం తోనే గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న చేసిన, చేయబోయే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలే ప్రచార అస్త్రాలుగా ప్రజల్లోకి వెళ్దామని తెలిపారు. నేను రైతు బిడ్డనే ఈ మండలం పూర్తిగా వ్యవసాయ ఆధారిత మండలం రైతు సమస్యలను పరిష్కరించాలన్న మండలం అభివృద్ధి చెందాలన్న మెజారిటీ స్థానాలు రాబోయే ఎన్నికల్లో మనం కైవసం చేసుకోవడం ఎంతైనా ఉందన్నారు. మండల మాజీ అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు రామాంజులనాయుడు మాట్లాడుతూ పార్టీ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు పార్టీలోనే కొనసాగుతున్న పార్టీకై మా సాయిశక్తుల పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే ఉన్నామని, ఊపిరి ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ కోసం, తపన పడి మన ఎమ్మెల్యే ఆదిమూలం కృషి చేస్తారని, ఆ పూర్తి విశ్వాసం నాకు ఉందని తెలిపారు. ఆయన తనయుడు సుమన్ తనకఉ కూడా బిడ్డలాంటి వాడని వీరిద్దరి సారథ్యంలో నియోజకవర్గ అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. నేను మీ వాడిని మీలో ఒకడిని, సంతకు వచ్చినట్లు వచ్చి సామాన్లు అమ్ముకుని పోయే వాడిని కాదయ్యా, నేను మీ మీలో ఒకడిని.....సోదరులారా నీకు సేవ చేసే భాగ్యం నాకు దొరికింది. నేను మీ ఊర్లలో గ్రావెల్, మట్టి, ఇసుక దోచుకుని వెళ్లేవాడిని కాదయ్యా, వనరుల దోపిడీ దారుడిని అంతకంటే కాదయ్యా, నేను మీ సేవకుడిని అన్నారు. అనంతరం ఏపీ మోడల్ స్కూలులో రూ.37 లక్షల ఎన్ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డు, ప్రహరీగోడ ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజులనాయుడు, ఏ.శివరావు, గోపినాథ్‌రెడ్డి, తెరణి జయరాంరెడ్డి, శ్రీహరియాదవ్, విజయకుమార్ నాయుడు, మల్లికార్జున్‌రెడ్డి, చెంగారెడ్డి, పిచ్చాటూరు ఇళంగోవన్‌రెడ్డి, పాలమంగళం డా. రమేష్, తహసీల్దార్ స్పందనరెడ్డి, ఎంపీడీవో మాలతి, ఎంఈవో లక్ష్మిపతి, ఏపీఎం ఇందిరా, మండల ట్రాన్స్‌కో ఏఈ ఇంజనీర్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, ఎస్ఐ ఓబయ్య, పోలీసు బృందం, పిచ్చాటూరు, నాగలాపురం, వరదయ్యపాళెం, సత్యవేడు, బుచ్చినాయుడు కండ్రిగ, నారాయణవనం, కేవీబీ పురం మండలాలపార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిన...కేవీబీపురం మండల వైసీపీ నేతలు

కేవీబీపురం, జూలై 18 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలంలో సత్యవేడు నియోజకవర్గం బీఎల్‌ఏ ఇన్‌చార్జి కోనేటి సుమన్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కేవీబీ పురం మాజీ టీడీపీ అధ్యక్షుడు టి.రామాంజులనాయుడు, రాష్ట్ర కనీస వేతన మండలి డైరెక్టర్ తెరణి జయరాంరెడ్డి, తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కోనేటి సుమన్ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు.

## కళ్లముందే కడతేరుతున్న మూగజీవాలు

**-జనసేన నాయకుడు తపసి మురళి రెడ్డి**



**చంద్రగిరి, జూలై 18 ప్రభాతవార్త:** జీవనాధారమైన మూగజీవాలు కళ్ళముందే కడతేరుతున్నా తమ నిస్సహాయ స్థితికి రైతులు మౌనంగా రోధిస్తున్నారని జనసేన నాయకుడు తపసి మురళిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ తొండవాడ, శానంబట్ల పంచాయతీలలో మేకలు, గొర్రెల పెంప కమే జీవనాధారంగా బ్రతుకుతున్న రైతులు అంతు చిక్కని వ్యాధి తో అకాల మరణం పొందుతున్న మూగజీవాల దుస్థితికి విలవి లలాడిపోతున్నారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు ఇకనైనా గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మూగ జీవాల మృతికి కారణాలను గుర్తించాలని కోరారు. రైతులకు మందులను ఉచితంగా అందించా లన్నారు. రైతుల సమస్యను పట్టించుకోకుంటే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని హెచ్చరించారు.

## డ్రగ్స్‌పై... సైకిల్ ర్యాలీ - ఎస్ఐ




**సత్యవేడు, జూలై 18 ప్రభాతవార్త:** సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం మాధక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమై సుమారు 5 కి.మీ దూరంలో ఉన్న వీఆర్ కండ్రిగ గ్రామం వరకు కొనసాగింది. అలాగే సత్యవేడు ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్యేక ఆకర్షణగా ఎస్ఐ విద్యార్థులతో కలసి సైక్లింగ్ చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు సైకిల్ తొక్కుతూ వారికి ఆదర్శంగా నిలిచారు. ఎస్ఐతో కలసి విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత మాధక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర వడంతో పాటు జీవితాలు నాశనం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి(ఎంఈవో), ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఫిట్ ఇండియా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ భాస్కర్ పాల్గొన్నారు.

## భూసార పరీక్షపై పాఠశాల విద్యార్థులకు శిక్షణ



**సత్యవేడు, జూలై 18 ప్రభాతవార్త:** సత్యవేడు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో చదువుకుంటున్న 8,9 తరగతుల విద్యార్థులకు భూసార పరీక్ష ప్రాముఖ్యతపై శిక్షణ ఇచ్చారు. శనివారం తిరుపతి జిల్లా వనరుల కేంద్రం (తిరుపతి), సత్యవేడు మండల వ్యవసాయ శాఖ ఏవో మురళి ఆధ్వర్యంలో భూసార పరీక్ష ప్రాముఖ్యతపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ భూసార భూమిలో లోపించిన దాతువులను తెలుసుకుని తదనుగుణంగా సేంద్రియ ఎరువుల ద్వారా భూసారాన్ని పెంచుకునే అవకాశం ఉందన్నారు. భూసార పరీక్ష కోసం మట్టిని సేకరించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మట్టి సేకరణ విధానం తదితరాంశాలపై భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారి పుష్పావతి, కుముద వివరించారు. కార్యక్రమంలో బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసూన, స్థానిక వ్యవసాయ సహాయకురాలు సవిత, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈ నెల 20తేదీ నుంచి రిజిస్ట్రేషన్ సేవలకు బ్రేక్

**పుత్తూరు రూరల్, జూలై 18 ప్రభాతవార్త:** స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో ప్రైవేటీకరణకు సంబంధించిన జీవో నెం.396ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖలు, డీటీపీ ఆపరేటర్లు, వారి సహాయకులు, స్టాంపు విక్రేతలు జూలై 20 నుంచి 31 వరకు పెన్‌డౌన్ ఆందోళన చేపట్టనున్నట్లు పుత్తూరు దస్తావేజు లేఖర్ల సంఘం ప్రకటించింది. ఈ సందర్భంగా అగ్రిమెంట్లు, దస్తావేజుల తయారీ, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సేవలు అన్ని అందుబాటులో ఉండవని ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేటీకరణ వల్ల అనేక మంది జీవనోపాధి దెబ్బతినడంతో పాటు ప్రజల ఆస్తుల భద్రతకు ముప్పు ఏర్పడుతుందని తెలిపారు.

